ఆ వెర్రినవాడు వదినగార్ని ఏడిపించాలని హరిజన వాడలోకి వెళ్ళి నిలబడి రాను రానని వదినగారిని బెదిరించేవాడట. ఆ హరిజనవాడలోకి వదినగారు రాదని ఆ మతిలేని పిల్లాడికి తెలుసు. ఇలా ఆ మరిదితో నానాబాధలూ పడ్డాక అతనికి సడన్‌గా ఓ రోజు ఆ జబ్బు అంతా మాయమయి మామూలు మనిషిలా చాలా వినయంగా భక్తిగా వదినగారికి కనిపించేసరికి ఆ తల్లి గోదావరిలా మహా పొంగిపోయింది.

అప్పుడు ఆ మరిది అడిగాడ్ట 'వదినా వదినా నీ ఒడ్డాణం ఏది?' అని. తాకట్టు పెట్టామని ఆవిడ చెప్పిందట. ఎందుకని మరిది రుకాయిస్తే నీకెందుకు నాయినా యివన్నీ అని ఆవిడ నవ్విందట.

తమ చదువుల కోసం రోగాల కోసం సంసారఖర్చుల కోసం వదినగారు ఒడ్డాణాన్ని తాకట్టు పెట్టేసిందని చిన్నమరిదికి కష్టం తోచింది. ఒడ్డాణం పెట్టుకోకపోతే వదిన మా వదిన కాదు అనుకునేవాడు ఆ మరిది. ఆ ఒడ్డాణమే గాకుండా చంద్రహారం చేతిగాజులు కూడా తాకట్టుకి వెళ్ళిపోయాయని తెలిసింది.

ఆ యింట్లో ఏ కష్టం వచ్చినా ఏ మంచి వచ్చినా వదినగారి ఒడ్డాణంతో సహా అన్నీ తాకట్లోకి వెళ్ళిపోయేవి.

బ్యాంకుల్నించి నోటీసులు వస్తే అవి పెద్దన్నగారి కంటబడకుండా దాచేది. 'ఇన్ని అప్పులా' అని ఆయన ఎక్కడ మతిపోగొట్టుకుంటారోనని ఆవిడ ఆయన కేమీ తెలియనిచ్చేదికాదు.

అయితే ఓసారి బ్యాంకువాళ్ళు ఆయన్ను ఆఫీసులో కలిసి ఒడ్డాణం విడిపించుకోకపోతే వేలం వేస్తామని అన్నార్ట. అప్పుడాయన ఆవిడ్ని పిలిచి 'నువ్వు దొంగవి' అని తిట్టార్ట. దానికి అభిమానం వచ్చి మా పెద్దత్తయ్యగారు ఆ ఒడ్డాణాన్ని అమ్మేసి అప్పులన్నీ తీర్చేసిందిట.

తాకట్టు పెట్టడం వేరు అమ్మడం వేరు. మరుదులంతా వదినగారికి మళ్ళీ ఒడ్డాణం చేయించి పెట్టాలని తీవ్రంగా ప్రయత్నించారు.

కాని, అలాటి శ్రీమహాలక్ష్మి లాటి వదినగారికి మళ్ళీ ఒడ్డాణం చేయించడం సాధ్యమా?

అదంతా ఓ జరగని కథ! ఎవరి పెళ్ళాం పిల్లలు వచ్చాక ఎవరి కథలు వారివి. అయితే కుటుంబాల్లో కూడా త్యాగాలు వృధా పోవు!

# 'శని'మాలు

మన్ని నవ్వించే వాళ్ళని మనం మర్చిపోతాం – మనల్ని యిబ్బంది పెట్టేవాళ్ళని మాత్రం గుర్తుంచుకుంటాం. వెన్నెల్లో చేసిన షికార్లు, చల్లగాలిలో పాడుకున్న పాటలు, వానలో తడుస్తూ పరుగులెత్తిన రోజులు, ఎండల్లో వీథుల్లో తిరగడాలు, తలుపులన్నీ మూసీ చీకటి చేసేసుకుని మంచంమీద ముడిచిపెట్టుకుని పడుకున్న సమయాలు, అన్నాలు తింటూ కబుర్లు చెప్పుగుంటూ

మళ్ళీ కొంచెం మళ్ళీ కొంచెం బావున్నది కలుపుగుంటూ తరగని విశేషాల్ను తవ్వుకుంటూ కూర్చున్న మధ్యాహ్నాలు యివేవీ ఎందుకో గుర్తుండవు. మనకి ఎంతోయిష్టమైన స్నేహితుడో చుట్టమో రావడం, ఎన్నాళ్ళనుంచో కొనుక్కుందామనుకున్న బల్లో, కుర్చీనో, అద్దమో, బీరువాయో కొనుక్కోవడం, స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకుని గుళ్ళోకెళ్ళడం, అనుకోకుండా ఏ యిష్ట మిత్రులో రామదాసు కీర్తనలో, అష్టపదులో, అన్నమా చార్యుల కృతులో చేసిన టేపుగాని మాండలిన్ శ్రీనివాస్ టేపుగాని వినమని తెచ్చివ్వడం, అనుకోకుండా రోజల్లా ఓ మంచి పుస్తకం చదువుతూ గడిపేయడం యివన్నీ యాదృచ్ఛికాలేకాని మనసు పొరల్లో అడుగున పడిపోయి గురుతుండవు.

మాట వరసకి, చెప్పొచ్చేదేవిటంటే - వోసారి యింటిల్లి పాదీ ఏదో మంచి సినిమాకు కట్టకట్టుగుని బయల్దేరాం. పదో పన్నెండో టిక్కెట్లు కావాలి గనుక మార్నింగ్‌షోకి టిక్కెట్లివ్వమని ఫోన్‌చేసి ఎందుకైనా మంచిదని ముందుగా టిక్కెట్లు తెమ్మని ఆఫీసు బోయ్‌ని పమ్మించేం. అతను వెళ్ళి టిక్కెట్లు తెచ్చి యిచ్చాడు. పిల్లలూ నావా నత్తాతో అందరం ముఖాలు కడుక్కుని, పవుడర్లు కొట్టుకుని, మూతీ ముక్కూ అలంకరించుకుని, శుభ్రమైన బట్టలేసుకుని బయల్దేరి వెళ్ళేసరికి ఏవో అడ్వర్టైజ్‌మెంట్లూ అవీ చూపిస్తున్నారు. హమ్మయ్య అని కుర్చీల్లో కూలబడ్డాం. ఇలా కూచోగానే పిల్ల ముండలు అవి కొనమని యివి కొనమని అటు తీసుకెళ్ళమని యిటు తీసికెళ్ళమని ప్రాణాలు పీకి పిండేస్తున్నారు. ఆడవాళ్ళకి ఈ పిల్లా-పీచూ వోపెద్ద శాపం. ఏ సినిమా చూడాలన్నా, సరదాగా ఎక్కడకు వెళ్ళాలన్నా, షాపింగుకైనా పిల్లలు పుట్టాక సాగమంటే సాగదు - ఆ భోగమేవన్నా వుంటే అంతా పెళ్ళికి ముందే లేదా పిల్లలు పుట్టకముందే తీర్చుకోవాలి. ఆ సిల్కుస్మితో అనురాధో జ్యోతిలక్ష్మో డాన్స్ ప్రారంభించడం చాలు మా వెధవలు 'అమ్మా బాయ్ అమ్మాపాలే' అంటూ పాట ప్రారంభిస్తారు - ఏదీ చూడనివ్వరు, విననివ్వరు. ఎంత మంచి చీరకట్టుకున్నా వళ్లో కూచుని తొక్కి తొక్కి చీర అందమంతా పాడుచేస్తారు. లేకపోతే, మనం మంచి హుషారుగా హీరో హీరోయిన్ల గెంతులు చూస్తూ వుంటే వో పిల్లముండ కుర్చీల సందునుంచి జారి ఏమూలకోపోయి మాయమైపోతుంది. ఇక దానికోసం గేటు వాళ్ళని బతిమాలి అన్ని క్లాసులూ వెతికి ఆ పిల్లముండని పట్టుకురావడం-యిదేమీ గ్రహించని మగాళ్ళు 'చంటిపిల్లల్ని వదిలేసి సినిమా చూస్తారా, వాళ్ళు దగ్గరెట్టుకోవద్దా' అని కోప్పడ్డాలు యివన్నీ తదనంతర తద్దినాలు.

ఇంతలో అసలు సినిమా బిగినయింది. ఎవరో వచ్చి మమ్మల్ని మీ టిక్కట్లు చూపించండి అన్నారు. మేం చూపించం. మరయితే మీకు మాకూ ఒకే వరస ఒకే నంబరు టిక్కెట్లు ఎలా యిచ్చారు హాలు వాళ్ళు - లేవండి లేవండి అని వాళ్ళు దబాయించారు. మేం లేవం - డబ్బిచ్చి కొనుక్కున్నాం మీరే వెళ్ళండి అని మేమూ కాస్త గట్టిగా మాట్లాడాం. ఈ లోగా మావి సరైన టిక్కెట్లే మీరు లేవాలి అని హాలువాళ్ళని తీసుకొచ్చారు వాళ్ళు. మరి మా సంగతేవిటి అని మేమూ అడిగాం. అప్పుడు మా టిక్కెట్లు చూసి ఆ హాలువాడు 'యివి మాట్నీ టికెట్లు

మేట్నీ టికెట్లు కొని యీవెనింగ్‌షోకి వచ్చారు – కుర్చీలు ఖాళీ చెయ్యండ'ని హాలువాడు మమ్మల్ని బలవంతపెట్టాడు. ఇదేవిటిరా భగవంతుడా యిల్లా జరిగిందని లేచి బుక్కింగ్ దగ్గరకెళ్ళి 'ఈవెనింగ్ షోకని ఫోనుచేసి మనిషిని పంపితే మ్యాట్నీకి ఎలా యిచ్చావయ్యా టిక్కెట్లు' అంటే 'మీ ఆఫీసుబోయి పట్టికెళ్ళాడు. మాదేం తప్పులేదు, మీరు ఖాళీ చెయ్యాలిసిందే' అని హాలువాడు 'కేరెసిన్' లా మాట్లాడాడు. పైగా మీరు మ్యాట్నీకి రావలసింది రాలేదు, కుర్చీలు ఖాళీగా వుంచేశాము. మీ టిక్కెట్లకు సొమ్ము వాపసివ్వబడదు అని జడ్జిమెంటు యిచ్చేశాడు. మాకు చాలా అవమానం వేసింది. హాలునుంచి పిల్లల్ని మోసు కుంటూ రిక్షాలెక్కి యింటికి వస్తే 'సినిమాకి వెళ్ళి అప్పుడే వచ్చేశారేం' అని యిరుగూ పొరుగూపరామర్శ. మొగుడు కొట్టినందుకు కాదుగాని తోటి కోడలు దెప్పినందుకు ఏడిచినట్లయింది మా పని.

ఇంకోమాటు మాయింటికొచ్చిన చుట్టాలు మమ్మల్నందర్నీ సెకండ్‌షోకి మా యింటి దగ్గర హాలుకే తీసికెళ్ళారు. మా మరిదిగారు వెళ్ళి ఏడు రూపాయిల టిక్కెట్టుకి పన్నెండురూపాయిలిచ్చి ఆరు టిక్కెట్లు తెచ్చి ఎట్టకేలకు 'హవుస్ ఫుల్' బోర్డు పెట్టాక కూడా బ్లాకులో టిక్కెట్లు కొని బుజాలు ఎగరేసుకుంటూ వచ్చారు. తీరా గేటువాడు 'ఈ టిక్కెట్లు చెల్లవండి – అయిపోయిన షోలవి. బయట కొన్న టిక్కెట్లుచెల్లవని బోర్డు పెట్టాం. చూళ్ళేదా' అని మమ్మల్ని పోలీసులకి అప్పగించకుండా మర్యాదగా యింటికిపోయి మజ్జిగ అన్నం తిని పడుకోమన్నాడు. అప్పుడు మాకు చాలా షేమ్ అయిపోయింది. కాస్తాకూస్తా, వెధవ ఏడురూపాయిలకు పన్నెండిచ్చి ఆరు పన్నెళ్ళు డెబ్బై రెండు(రూపాయిల చేతి చమురు వదుల్చుకుని తద్దినాన్ని చంకనెట్టుకువెళ్ళినట్లు వెళ్ళాము. 'సినిమా పోయే –శనిపట్టె' నన్నట్లు అయింది. మా మరిదిగారిది యీవూరు కాదు. మా సిస్టరు కాస్త సిసింద్రీ, నోటి దురుసు కూడా వుంది. అది అతడ్ని తిట్టిన తిట్టు తిట్టకుండా దెప్పి పోసింది. డబ్బై రెండు రూపాయిలకి ఎన్ని కేజీల వంకాయలు, లేదా గోంగూర, లేదా దోసకాయలు, టమాటోలు, తదితర విజిటబుల్సు వస్తాయో చెప్పి 'తగలేశావురా మగడా' అన్నట్లు ఎడాపెడా వాయించేసింది. అలా వాజమ్మని చేసి అది ఎన్ని తిట్టినా ఆ మానవుడు చింతాకంతన్నా చలించలేదు. చిరునవ్వులు చిందుస్తూ మందస్మిత వదనారవిందుడై, పోనీ వెధవ డెబ్బై రెండూ – వాల్యుబుల్ ...ఎక్స్‌పీరియన్స్ ఇన్ లైఫ్ వచ్చింది కదా – బ్లాకులో టిక్కెట్లు అమ్మేవాడికి నిజాయితీ వుండద్దా – అని మళ్ళీ వెళ్ళి వాణ్ని హాలు దగ్గర పట్టుకుని డొక్క చించుతానన్నాడు. ఆ భార్య పోరు పడలేక మళ్ళీ హాలు దగ్గరకెళ్ళి ఆ వెధవ కోసం వెతికి కనపళ్ళేదని విచారించి వచ్చాడు. ఆ దొంగ టికెట్లనమ్మినవాడు అక్కడ నిలబడి తనకి పట్టుబడి తన చేత తన్నులు తినాలని మా మరిదిగారి ఆశ. దొంగ తెలివితేటలెపుడూ మన కంటేముందుంటాయి అతను భవిష్యత్తులోకి తన చూపుల్ని నిగుడిస్తూ మన జేబులో చేతుల్ని పెడతాడు.

ఏతావాతా తేలిందేమంటే మన సొసైటీలో సినిమా హాలు దగ్గర గేటువాడు, టికెట్లమ్ముు వాడూ వాళ్ళిద్దరూ పవర్‌ఫుల్ మనుషులు! అల్లాగే హాలు మేనేజర్లూ – వాళ్ళు మేపే స్థానిక రవుడీలు.

రిక్షాలో సినిమానుంచి వెళ్తున్న మొగుడూ పెళ్లాల్ని పోలీసులు భయపెట్టినట్లు హాలు వాళ్ళని పోలీసులు భయపెట్టగల్రా? లేరు. సినిమా హాలు మేనేజర్లకి పోలీసువాళ్ళకి లావాదేవీలు, యిచ్చి పుచ్చుకోడాలు, అనేక మర్యాదలుంటాయ్.

మామూలు తెలివితక్కువ ప్రేక్షకులు ఎ.సి. వెయ్యటం లేదేమని అడిగితే హాలువాళ్ళు పళ్ళూడగొట్టి చేతులలో పెడ్తారు. పెట్టరూ?

అందుకే మా చచ్చిపోయిన మేనత్త ఒకావిడ సినిమా అండం రాక, నోరు తిరక్క 'శనీమా' అనేది. ఇవి నిజంగా సినిమాలు కావు – 'శనిమా హాళ్ళే' సుమా! సినిమా దుఃఖం జన్మ దుఃఖం జరా దుఃఖంలా పునః పునః కలుగుతూ వుంటుంది. తస్మై శ్రీ గురవేనమః

# మావూరు బెజవాడ

**మా** చిన్నపుడు 'బెజవాడ' వెళ్ళడమంటే మా కెంతో గొప్పగా, దర్జాగా అంతకంటె మరీ మరీ సరదాగా వుండేది. రైలు కృష్ణా బ్రిడ్జి మీంచి వెళ్తుంటే 'ధన్ – ధన్ – ధన్ – ధన్ – ధన' మని చప్పుళ్ళు చేస్తుంటే, బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే – మా కెంతో గర్వంగానూ, గొప్పగానూ వుండేది. ఏలూరు వైపు నుంచి కాని నైజాం వైపు నుంచి కాని రైలు మీద వస్తుంటే అంత యిదిగా వుండేది కాదు మాకు. ఎందుకంటే వానా కాలంలో తిక్క వచ్చినట్లు పరవళ్ళు తొక్కే బుడమేరు తప్ప ఆ వైపు కృష్ణమ్మా లేదు, ధనాధన్ మనిపించే పెద్ద బ్రిడ్జీ లేదు. కృష్ణానది యిటు వైపున కూడా ప్రవహిస్తే ఎంత బావుణ్నో అని ఫీలయేవాళ్ళం. బెజవాడంటే మాకు మా విశ్వనాథం మామయ్యగారే. మా వారేమో అప్పటికింకా చిన్న బచ్చాయేట. మా వారి చిన్నపుడు వాళ్ళ బెజవాడ పెదనాన్నగారన్నా బెజవాడ అమ్మఅన్నా ఎంతో ప్రాణం. ఆయనెప్పుడూ మిఠాయిలు, పళ్ళు, పూలూ, కొత్తబట్టలూ, ఆటవస్తువులూ, దీపావళయితే పెట్టె నిండా టపాకాయలూ ఎన్నో తెచ్చేవారు(ట) అంతేగాక పిల్లలకు కొత్త కొత్త అణాలు, అర్ధణాలు, బేడాలు, చిల్లు కానీలు, పైసలు, పాత పావలా, కొత్త పావలాలు పొట్లాల్లోంచి తీసి పంచిపెట్టేవారు. ఆడపిల్లల కయితే స్కిప్పింగ్ రోప్స్, పూసలు, బొమ్మలూ, చేతి రుమాళ్ళు, మగ పిల్లలకయితే బంతీ బ్యాట్, రబ్బరు బంతులు, పెన్నులు, పెనసళ్ళు, కీ యిస్తే పరిగెత్తే కార్లు, విమానాలు, బైనాక్యులర్స్, రంగుల గోళీ కాయలు, బిస్కట్లు బొమ్మల పుస్తకాలు యిలా ఎన్నెన్నో తెచ్చి పంచిపెట్టేవారు. అంతేగాక మా పిల్లల్నందర్నీ వేసుకు కాఫీ హోటళ్ళకి తీసికెళ్ళి టిఫిన్లు తినిపించే వారు. సాయంత్రాలు దుర్గాకళామందిరానికి లేపోతే సరస్వతి టాకీస్‌కి లీలామహల్‌కి సినిమాలకు తీసుకెళ్ళే వాళ్ళు. అంచాత ఆ బెజవాడ పెదనాన్నగారు వస్తే మా పిల్లలకెంతో సరదాగా ఎగిరిగంతేసినంత ఉత్సాహంగా వుండేది. ఆ రోజుల్లో